# గమ్యం

బస్సు కోసం నిలబడినప్పుడు వచ్చింది ఆ ఆలోచన... ప్రసాద్‌ని కలిస్తే

ప్రసాద్ నా సహోద్యోగిగా వుండేవాడు. మంచి స్నేహితుడు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పదవీవిరమణ చేసినంతవరకు కలసి పని చేశాము. అరమరికలు లేకుండా వుండేవాళ్లం. వాణ్ణి చూసి సంవత్సరం దాటింది.

పట్నం వచ్చినప్పుడల్లా వాడిని కలవాలని అనుకుంటూనే చూడకుండా వెళ్లిపోతున్నాను.

పదవి విరమణ చేశాక బస్‌స్టేషన్‌కి రెండు వీధుల అవతల వున్న కొడుకు ఇంట్లో ఉంటున్నాడు వాడు.

గబగబా నడిచాను.

సాయంసంధ్యాసమయం. తూర్పులో ఉదయించిన వెలుగు జీవితాన్ని గుప్పెటలో పెట్టుకొని పశ్చిమానికి వలస వెళుతోంది.

వీధి నిర్మానుష్యంగా ఉంది.

ఓ సంవత్సరం క్రితం ప్రసాద్‌ని కలవటానికి వచ్చినప్పుడు వీధి కళకళలాడుతూ ఉండేది. అప్పుడు రోడ్డు నిండా పిల్లలే. వాళ్ల ఆటలకు, అరుపులకు వీధి దద్దరిల్లిపోతూవుండేది. కానీ ఇప్పుడు...

ఇప్పుడు శవం వెళ్లిన ఇల్లులా ఉంది వీధి.

ఏ ఇంటిలోనూ అలికిడి లేదు. వీధిని కబళించబోయే చీకటి పొరలను వెనక్కు నెట్టివేసే వీధిదీపాలు ఇంకా ప్రాణం పోసుకోలేదు.

గబగబా అడుగులు వేసి మలుపు తిరుగాను.

"నీవా రారా". నన్ను చూసిన ప్రసాద్ మోము ఆనందంతో మెరిసింది. వేళకాకముందే చంద్రుడు ఉదయించినట్లు తోచింది నాకు.

"కూర్చోరా" కూర్చున్న కుర్చీలోంచి లేస్తూ అన్నాడు ప్రసాదు.

ప్రసాద్ లోపలకు వెళ్లాడు.

ఉత్తమ మానవుని హృదయంలా ఉన్నతంగా ఉండే అక్కడ కూర్చుని చూస్తే విశాలమైన వూరంతా చాలా అందంగా కనబడుతుంది. కాని స్వార్థపరులైన మానవులు వారి మధ్యన నిర్మించుకున్న అడ్డుగోడల లాంటి ఇంటి ప్రహారీ గోడలు విశాలమైన ఊరిని వీక్షించటానికి అడ్డుగా నిలుస్తున్నాయి.

"ఇక్కడే కూర్చుందాముురా" మరో కుర్చీ తీసుకొని వచ్చాడు ప్రసాద్. "చాలా రోజులయింది రా బావా నిన్ను చూసి ఏమిటి విశేషాలు?" ఉద్యోగంలో చేరినప్పటినుంచీ ఒకరినొకరు బావా అని పిలుచుకోవడం అలవాటు.

"ఏముంది బావా, అంతా మామూలే" నేను మొదలెట్టాను. పదవీ విరమణ చేసిన మా స్నేహితుల గురించి, వాళ్ళ పిల్లల గురించి, కోడళ్లతో వాళ్లు పడే బాధల గురించీ ఊసులడుకున్నాము. అమెరికా వెళ్లి కనుమరుగైపోయిన పిల్లలు గురించీ, వూరిలోనే వున్నా కోడలి చేతిలో చిక్కుకుపోయి కనుమరుగైపోయిన పిల్లలు గురించి మాట్లాడుకున్నాము.

ఒక గంట గడిచింది.

"ఇక నేను బయలుదేరతాను బావా" మెల్లిగా లేచాను నేను.

"సారీరా బావా" ప్రసాద్ నా చేతులు పట్టుకొని అన్నాడు. వాడి గొంతు జీరబోయింది. "ఎంతో దూరం నుంచి శ్రమపడి వచ్చావు. నీకు కనీసం ఒక కప్పు కాఫీ కూడా..."

"బాధపడుకురా. కులాసాగా మనం చెప్పుకున్న కబుర్లకన్నా ఇంకేం కావాలిరా, పొట్టనిండదానికి"

ప్రసాద్ ఏమీ అనలేదు. అతని మొహం కొంత వెలిగినట్లే తోచింది

నాకు. కానీ చంద్రునిలో మచ్చలాగే అతని గుండెలో బాధ ఉండిపోయిందనేది నేను గమనించకపోలేదు.

కుర్చీ నుంచి లేచి ఇంటివైపు చూశాను. ఇంట్లో అస్సలు అలికిడి లేదు. ఏ గదిలోనూ దీపం వెలుగుతున్నట్లు లేదు.

ప్రసాద్ కొడుకూ కోడలూ ఇంట్లో లేరేమో! అమటే అడిగాను.

"వాళ్లు వున్నారు కనుకే గదరా మనం ఇక్కడ కూర్చున్నాం" నాకు ఆశ్చర్యం కలిగింది.

"నీకు ఆశ్చర్యంగా ఉంది కదూ, ఈ సమయంలో ఇంటికి ఏ అతిథి వచ్చినా వాళ్లు చిరబురలాడుతారు"

ప్రశ్నార్థకంగా నేను ప్రసాద్ వేపు చూశాను.

"అవును బావా, ఇది మా మనవరాలు చదువు సమయం"

"మీ మనవరాలు చదివేది యు.కె.జి. కదా?"

"యు.కె.జి.యే. కదా అని అంటావేమిటి" ప్రసాద్ ఒక నిమిషం ఆగాడు. తర్వాత అన్నాడు "ఇప్పటి చదువులేమైనా మనకాలం చదువులా దుంపలబడిలోని, వానాకాలం చదువులని అనుకుంటున్నావేంటి? బోలెడు డబ్బుపోసి చదువు కొంటున్నారు. అందుకే ఇంకో వ్యాపకమూ లేదు, ఆటా లేదు, పాటా లేదు. బడిలోనూ చదువే, ఇంటిలోనూ చదువే"

నేను ముందుకు అడుగులు వేశాను. హఠాత్తుగా ఇంట్లో దీపాలు వెలిగాయి. సినిమాహాలులో ఆట అయిపోగానే కనబడే కదలిక ఇంట్లో కనబడింది.

"చదువయిపోయింది" అరచుకుంటూ ఆనందంగా బయటకు వచ్చింది ప్రసాద్ మనవరాలు. "హాయ్ పరవాడ తాతయ్యా" నన్ను చూసి ఆశ్చర్యంగా అంది పాప "ఎప్పుడు వచ్చావు తాత"

"కాస్సేపయిందిలే. నువ్వు బాగా చదువుతున్నావా తల్లీ"

" బాగా చదువుకోకపోతే ఎలా తాత" అంది పాప. "బాగా చదువుకున్నా మాకు ఇక్కడ ఉద్యోగాలు రావు కదా తాతా. మరి అమెరికా వెళ్లాలంటే ఇప్పటినుంచే చాలా బాగా చదువుకోవద్దూ"

నా బుర్ర తిరిగిపోయింది.

సాయంకాలపు సంబరాలుకు విడాకులిచ్చినందువల్ల ఒంటరిగా కుమిలిపోతున్న వీధిలోకి అడుగులు వేసినప్పుడు ఆ పాప ఆలోచనాశక్తికి దాన్ని మెచ్చుకోవాలో, లేకపోతే నేటి దుస్థితి గురించి దుఃఖించాలో అని తేల్చుకోలేక పోయాను నేను.

**ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 26 అక్టోబర్ 2002**